# సర్కారుకు సాయంగా 'పోచంపాడ్ చేప'



పోచంపాడ్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం

- ప్రభుత్వానికి వ్యయం తగ్గిస్తున్న చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం
- నీలి విప్లవానికి బాసటగా సమృద్ధి పథంలోకి
- వందల చెరువులకు ఉచిత సరఫరా
- అరకొర ఉత్పత్తి నుంచి రాష్ట్రంలోనే రికార్డు స్థాయికి

కమ్మర్‌పల్లి, డిసెంబర్ 1 : నిజామాబాద్ జిల్లా ఎస్సారెస్పీ వద్ద ఉన్న ప్రభుత్వ పోచంపాడ్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం నీలి విప్లవానికి బాసటగా నిలుస్తున్నది. పరాయి పాలనలో నిధులు లేక అరకొర ఉత్పత్తి సామర్థ్యంతో మాత్రమే కొనసాగిందీ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం. స్వరాష్ట్రం వచ్చాక తగు నిధులు సమకూరడంతో ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరిగింది. ఫలితంగా జిల్లాలో వందలాది చెరువులకు పోచంపాడ్ చేప పిల్లలు పోటెత్తుతున్నాయి. తద్వారా మత్స్యకారులకు ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వానికి వ్యయ భారాన్ని తగ్గిస్తూ ప్రభుత్వ లక్ష్యానికి దోహదపడుతున్నది. దీని అభివృద్ధికి సరైన నిధులు లేక నీరస పడ్డ పోచంపాడ్ చేప పిల్లల అభివృద్ధి కేంద్రాన్ని నీలి విప్లవానికి దోహదపడేలా తీర్చి దిద్దడానికి, ఉత్పత్తి సామర్థ్యం పెంచడానికి రాష్ట్ర రోడ్లు-భవనాలు, గృహ నిర్మాణ, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రత్యేకంగా కృషి చేసి నిధులు మంజూరు చేయించారు. మంత్రి కృషి ఫలితాలను ఈ కేంద్రం అందిస్తున్నది.

**ప్రభుత్వ ప్రోత్సాహం**

పోచంపాడ్ చేప పిల్లల అభివృద్ధి కేంద్రం సామర్థ్యాన్ని పెంచితే ఉత్పత్తి పెరిగి మేలు జరుగుతుందని మత్స్యకారులు, మత్స్య శాఖ అధికారులు గత పాలకుల హయాంలో ఎంత అడిగినా దీని అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి చూపలేదు. దీంతో దశాబ్దాల తరబడి అరకొర ఉత్పత్తి, సౌకర్యాల లేమితో ముక్కుతూ మూల్గుతూ కొనసాగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం నీలి విప్లవ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది. ఇందులో భాగంగా మత్స్యకారులకు ఉచితంగా చేప పిల్లలను అందించే కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పోచంపాడ్‌లోని ప్రభుత్వ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంపై దృష్టి సారించారు. ఉత్పత్తి కేంద్రాన్ని తరచూ సందర్శిస్తూ ఉత్పత్తి వీలైనంతగా పెంచే ఏర్పాట్లు చేయించారు.అప్పటికి కేవలం 110 నర్సరీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. నీటి సౌకర్యానికి ఇబ్బందులు తలెత్తుతుండేవి. దీంతో ఈ కేంద్రం అభివృద్ధికి రూ.7 కోట్ల నిధులు మంజూరు చేయించారు మంత్రి వేముల.

**సౌకర్యాల అభివృద్ధి**

రూ.7 కోట్ల నిధుల మంజూరుతో పోచంపాడ్ చేప పిల్ల ఉత్పత్తి కేంద్రంలో అవసరమైన సౌకర్యాలు సమకూరాయి. నర్సరీల సంఖ్య పెరిగింది. కొత్తగా 140 నర్సరీల నిర్మాణం చేపట్టారు. దీంతో నర్సరీల సంఖ్య 250కి చేరింది. వీటితో పాటు హేచరీల అభివృద్ధి జరిగింది. చైనీస్, ఇకో హేచరీలు, ల్యాబ్‌తో మేలు రకమైన చేప పిల్లలను అభివృద్ధి చేసే సౌకర్యం కలిగింది. నర్సరీల సంఖ్య పెరగడంతో ఉత్పత్తి సామర్థ్యం పెరిగింది. కొత్తగా ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించడంతో నీటి ఇబ్బందులు తొలగి పోయాయి. ఇలా ప్రభుత్వ ప్రోత్సాహంతో పోచంపాడ్ చేప పిల్ల ఉత్పత్తి కేంద్రం ఉత్పత్తి సామర్థ్యం బాగా పెరగడంతో పాటు ఉత్పత్తిలో వేగం సైతం పెరిగింది. 35-45 ఎం.ఎం. సైజు చేప పిల్లల ఉత్పత్తి నిరాటంకంగా జరుగుతున్నది. ఫలితంగా మత్స్యకారులకు ప్రతి సంవత్సరం ఉచితంగా చేప పిల్లలు అందిస్తుండడంతో ప్రభుత్వానికి అయ్యే వ్యయంలో చేదోడుగా నిలుస్తున్నది. ఈ కేంద్రంలో గత ఏడాది 92.66 లక్షల చేప పిల్లలను ఉత్పత్తి చేసి జిల్లాలోని 323 సీజనల్ చెరువుల్లో వదిలారు. తద్వారా ప్రభుత్వానికి గత సీజన్‌లో రూ.56 లక్షల వ్యయాన్ని తగ్గించింది. 92.66 లక్షల ఉత్పత్తి సాధిచడం ద్వారా పోచంపాడ్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం గతేడాది రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. నిజామాబాద్ జిల్లాలో వంద చెరువులకు చేప పిల్లలను అందించేలా నీలి విప్లవానికి బాసటగా ఎదిగింది. బొచ్చ, రోహు, బంగారు తీగ రకాల చేప పిల్లలను అందిస్తున్నది.

**ఈ సీజన్‌లోనూ భారీ ఉత్పత్తి**

2022-23 సీజన్‌లో భారీగా ఉత్పత్తి సాధించిన పోచంపాడ్ ప్రభుత్వ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం 2023-24 సీజన్‌లోనూ అదే రీతిలో పని చేసింది. 2023-24 సీజన్‌లో రూ.4.50 కోట్లతో నిజామాబాద్ జిల్లాలోని 998 చెరువుల్లో 4.57 కోట్ల చేప పిల్లలను విడుదల చేశారు. 2023-24 సీజన్‌లోనూ పోచంపాడ్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ద్వారా ప్రభుత్వానికి రూ.28 లక్షల ఆదా అయ్యింది.

### ఉత్పత్తి సామర్థ్యం పెరగడంతో మేలు



పోచంపాడ్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో చేప పిల్లల ఉత్పత్తి సామర్థ్యం పెరిగింది. దీంతో నీలి విప్లవ లక్ష్యానికి దోహదం జరుగుతున్నది. నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం ద్వారా ఈ కేంద్రంలో ఉత్పత్తి గణనీయంగా పెరిగి చెరువుల్లో పోచంపాడ్ చేప పిల్ల పెరుగుతున్నది. తద్వారా ప్రభుత్వానికి వ్యయం తగ్గిపోతున్నది.

**-రాజ నర్సయ్య, జిల్లా మత్స్య అభివృద్ధి అధికారి**

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



గాంధారి, డిసెంబర్ 1 : ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడడంతో యువకుడు మృతి చెందిన సంఘటన గాంధారి మండలంలోని పొతంగల్ కలాన్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకున్నది. గాంధారి ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కాటేవాడి తండాకు చెందిన బానోత్ నరేశ్ (27) బిచ్కుంద మండలంలోని ఓ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. గురువారం ఓటు వేయడానికి కాటేవాడి తండాకు వచ్చిన నరేశ్, బానత్ రాజీవ్ అనే యువకుడితో కలిసి గురువారం ద్విచక్రవాహనంపై బిచ్కుందకు బయల్దేరాడు. పొతంగల్ కలాన్ గేటు సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడడంతో నరేశ్ అక్కడిక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన రాజేశ్‌ను చికిత్స నిమిత్తం నిజామాబాద్ తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య సుజితతో పాటు, కుమారుడు ఉన్నాడు. మృతుడి తండ్రి బానోత్ శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## అంతర్రాష్ట్ర చెక్ పోస్టు ఎత్తివేత

రెంజల్, నవంబర్ 1: మండలంలోని కందకుర్తి గ్రామ సరిహద్దులో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్ పోస్టును ఎత్తివేసినట్లు రెంజల్ ఎస్సై ఉదయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. శాసనసభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో తెలంగాణ - మహారాష్ట్ర సరిహద్దు గుండా మద్యం, డబ్బు రవాణా చేయకుండా అక్టోబర్ 20న చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. నిరంతరంగా వాహనాలను తనిఖీలు చేపట్టారు. నవంబర్ 30న శాసనసభ ఎన్నికలు ముగియడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెక్ పోస్టును ఎత్తివేశారు.

## గోదావరిలో మునిగి ఒకరి మృతి

ఏర్గట్ల, డిసెంబర్ 1: తడ్‌పాకల్ వద్ద గోదావరిలో ప్రమాదవశాత్తు నీటమునిగి జక్రాన్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన చిటికెల వినోద్ (37) మృతి చెందినట్లు ఎస్సై మచ్చేందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. వినోద తన భార్య, అత్త, బావమర్దితో కలిసి శుక్రవారం గోదావరి నదికి మొక్కు చెల్లించుకునేందుకు వెళ్లాడు. గోదావరిలో స్నానం చేసే క్రమంలో ప్రమాదశాత్తు నీట మునిగి మృతి చెందాడు. మృత దేహాన్ని బయటికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం అర్మూర్ ప్రభుత్వ దవాఖానకు పంపించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడు ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లి ఇటీవలే వచ్చాడు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోసిస్తున్నాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

## రేపు వైన్ షాపులు, కల్లు బట్టీలు బంద్

### పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్

నిజామాబాద్ క్రైం, డిసెంబర్ 1 : జిల్లావ్యాప్తంగా ఉన్న మద్యం షాపులు, కల్లు బట్టీలు ఈ నెల 3 నుంచి 4వ తేదీ ఉదయం వరకు బంద్ ఉంచాలని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఈ నిబంధనలు అమలులో ఉంటాయని సూచించారు. అండర్ సెక్షన్ 20(1) ఆఫ్ తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ యాక్ట్, 1968 ప్రకారం కల్లు బట్టీలు, కల్లు డిపోలు, ఐఎంఎల్ డిపోలు, వైన్ షాపులు, బార్లు, క్లబ్బులు ఈ నెల 3వ తేదీ ఉదయం 6 నుంచి 4వ తేదీ ఉదయం 6 గంటల వరకు బంద్ ఉంచాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం, ఇతర మత్తు పదార్థాలు సేవిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని, ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### బీజేపీ నాయకుల బెదిరింపులు..

# బీఆర్ఎస్ కార్యకర్త ఆత్మహత్య

- మృతదేహంతో బీజేపీ నాయకుల ఇంటి ముందు కుటుంబ సభ్యుల ధర్నా
- పోలీసుల హామీతో ఆందోళన విరమణ



బీజేపీ నాయకుల ఇంటి ముందు ఆందోళనకు దిగిన రాజాగౌడ్ బంధువులు



రాజాగౌడ్ (ఫైల్)

భీమ్‌గల్, డిసెంబర్ 1 : బీజేపీ నాయకుల బెదిరింపుతో బీఆర్ఎస్ కార్యకర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం బెజ్జోరాలో చోటు చేసుకున్నది. ఎస్సై హరిబాబు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తొనిగండ్ల రాజాగౌడ్(45) బుధవారం గ్రామంలో సంచరిస్తుండగా అదే గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు ఈర్ల లక్ష్మీప్రసన్న, నర్సు, మధు, మహేందర్‌కు రాజాగౌడ్ ఎదురుపడడంతో వారిమధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. బీజేపీ నాయకులు రాజాగౌడ్‌ను చంపుతామని బెదిరించారు. దీంతో మనస్తాపానికి గురైన రాజాగౌడ్ గురువారం మధ్యాహ్నం రెండుగంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా గ్రామ శివారులోని శుక్రవారం దేవి ఆలయ పరిసర ప్రాంతంలోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో ఆగ్రహిచిన కుటుంబ సభ్యులు శుక్రవారం బీజేపీ నాయకుల ఇంటి ముందు మృతదేహంతో ధర్నా దిగారు. సుమారు మూడు గంటల పాటు బైటాయించడంతో ఎస్సై అక్కడికి చేరుకొని రాజాగౌడ్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బీజేపీ నాయకులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-314353-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.